తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం మంగళవారం 08 సెప్టెంబర్ 2026 I

121 వసంతాల బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలు...

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,సెప్టెంబరు7,ప్రభాతవార్త. బ్యాంక్ ఆఫ్ ఇండియా దొమ్మేరు శాఖలో 121వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాతాదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి బ్యాంకు సేవలు, వివిధ పొదుపు పథకాలు, రుణ సౌకర్యాలపై అవగాహన కల్పించారు. సేవింగ్స్, కరెంట్ ఖాతాలు, ఫిక్స్‌డ్, రికరింగ్ డిపాజిట్లు, వ్యవసాయ, గ్రామీణ, ఎంఎస్ఎంఈ, గృహ రుణాలతో పాటు డిజిటల్ బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. బీమా, మ్యూచువల్ ఫండ్స్ తదితర సేవలపై వివరించారు. ఖాతాదారులతోసత్సంబంధాలు, సామాజిక బాధ్యతకు బ్యాంకు ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు, స్థానికులు పాల్గొన్నారు.

కాపు భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి

కాపు భవనం కేటాయించిన 30 సెంట్ల స్థలం వర్సిటీ పరిధిలోకి రాదు...

వర్సిటీ భూములంటూ అపోహలు వద్దు... కాపు భవన స్థలంపై క్లారిటీ ఇచ్చిన మంత్రి కందుల దుర్గేష్

కూటమి ప్రభుత్వంతోనే దశాబ్దాల కల సాకారం: మంత్రి కందుల దుర్గేష్

ధవళేశ్వరం, సెప్టెంబర్ 7(ప్రభాతవార్త) రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పరిధిలోని కలెక్టరేట్ సమీపంలో కాపు భవన నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కేటాయించిన 30 సెంట్ల స్థలంలో సోమవారం భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్,రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేశారు. ంతః సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. కాపుల కళ్యాణ మండప నిర్మాణానికి స్థలం కేటాయించాలని దశాబ్దాలుగా ప్రయత్నాలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరిలు సంకల్పించిన ఈ శుభకార్యానికి నేడు భూమిపూజ జరగడం ఎంతో సంతోషకరమన్నారు.కొందరు కావాలని ఇది విశ్వవిద్యాలయ స్థలమని దుష్ప్రచారం చేస్తూ అడ్డంకులు సృష్టించారని, అయితే ఈ 30 సెంట్ల స్థలానికి విశ్వవిద్యాలయంతో ఎలాంటి సంబంధం లేదని గణాంకాలతో సహా వివరించారు.2008లోనే మొత్తం 45 ఎకరాల స్థలంలో విశ్వవిద్యాలయ పరిధిని 20 ఎకరాలకు పరిమితం చేశారని తెలిపారు.మిగిలిన 25 ఎకరాల్లో 10 ఎకరాలను అగ్రికల్చర్ యూనివర్సిటీ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ లకు కేటాయించగా, అందులోనే ప్రస్తుతం కలెక్టరేట్ కొనసాగుతోందన్నారు.గోదావరి గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఎకరన్నరతో పాటు ఇతర ప్రభుత్వ సంస్థలకు మిగిలిన స్థలాన్ని కేటాయించారని, కాబట్టి కాపు భవనానికి ఇచ్చిన స్థలం వర్సిటీ పరిధిలోకి రాదని స్పష్టం చేశారు.సమాజంలో ఎవరికీ ఇబ్బంది కలగని రీతిలో ఈ సత్కార్యం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన ఈ మంచి కార్యక్రమం వల్ల ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. ఈ సందర్భంగా కాత్యవీర్యార్జునుడి ఉదాహరణను ప్రస్తావిస్తూ.. సాధారణంగా రెండు చేతులు ఉండే ఆయనకు యుద్ధ సమయంలో వెయ్యి చేతులతో బాణాలు సంధిస్తారని, అలాగే అవసరమైతే ప్రజా సంక్షేమం కోసం తాను కూడా వెయ్యి చేతులంత శక్తితో నిలబడతానని స్పష్టం చేశారు.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెప్పినట్లుగా పెద్దన్న పాత్ర పోషిస్తూ, ఎలాంటి వివక్ష లేకుండా సమాజంలోని అన్ని కులాలను, వర్గాలను కలుపుకుని ముందుకు పోవాల్సిన అవసరం ఉందన్నారు. భవన నిర్మాణం వేగవంతంగా పూర్తయి, సంపూర్ణ రూపుదిద్దుకున్నప్పుడే మన సంకల్పం పూర్తిగా సిద్ధిస్తుందని, ఇందుకోసం అందరం కలిసి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం వల్లే ఈ కల సాకారమైందని పేర్కొంటూ ఇందులో కీలక పాత్ర పోషించిన ఎంపీ పురందేశ్వరికి మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పరిపాలనాదక్షుడు డాక్టర్ రాయుడు గంగాధర్.

గంగాధర్ సంస్మరణ సభలో పలువురు ఘన నివాళులు.

తాళ్ళరేవు సెప్టెంబర్ 7 (ప్రభాతవార్త): సీనియర్ రాజకీయ నాయకుడు, తాళ్ళరేవు ఎంపీపీ భర్త డాక్టర్ రాయుడు గంగాధర్ పరిపాలనాదక్షుడని, ఆయన ఆశయాలు ముందుకు తీసుకు వెళ్లడానికి అందరూ కృషి చేయాలని పలువురు నాయకులు అన్నారు. పటవలలో డాక్టర్ రాయుడు గంగాధర్ స్వగృహం వద్ద సోమవారం జరిగిన సంస్మరణ సభలో పలువురు గంగాధర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాజకీయాలలో రాజీ లేకుండా ఆత్మాభిమానంతో గంగాధర్ పనిచేశారని గుర్తు చేశారు. ఏ విషయమైనా ముక్కుసూటిగా చెప్పే మనస్తత్వం ఆయనది అన్నారు. చిన్న వయసులోనే ఉన్నత చదువులు చదువుకొని ప్రజాసేవ చేయాలనే ఆశయంతో రాజకీయాల్లోకి వచ్చారన్నారు.ఆయన భార్య సునీతను ఎంపీపీగా చేసి ఆమెకు అండగా ఉన్నారన్నారు. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని రాజకీయాలలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి గంగాధర్ అని కొనియాడారు. గంగాధర్ తండ్రి రాయుడు అప్పారావు ఆశయాన్ని ఆయన సాధించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు ఆయన భార్య ఎంపిపి సునీత, కుమార్తె హాసినీ ప్రియ, కుమారుడు అభినవ్ లను పరామర్శించారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ స్పర్జన్, డిప్యూటీ ఎంపీడీవో వి జె వి రమణ, ఏవో కె. సత్యనారాయణ, మండల ఎంపీటీసీలు, కూటమి, వైకాపా ప్రజాసంఘాల నాయకులు, మండల, గ్రామస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, పటవల గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎం పర్యటన ప్రాంతాలను పరిశీలించిన పెందుర్తి వెంకటేష్,ఎమ్మెల్యే గిడ్డి..

అంబాజీపేట,సెప్టెంబర్ 7,(ప్రభాతవార్త) అంబాజీపేట మండలంలో ఈనెల 9న ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన ఖరారయ్యింది. ఈ పర్యటనలో అంబాజీపేట మండలంనకు చెందిన కె.పెదపూడి,చిరతపూడి గ్రామాల రైతులకు రాజముద్రతో ముద్రించిన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేయనున్నారు.ఈ పర్యటన సందర్భంగా సిద్ధం చేస్తున్న హెలిప్యాడ్, రైతులకు పాసు పుస్తకాలు అందించే సభాస్థలం, అనంతరం టీడీపీ కార్యకర్తలతో సమావేశం సభా స్థలాలను సీఎం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేశ్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు రెడ్డి సుబ్రహ్మణ్యం, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణబాబు లు సోమవారం పరిశీలించారు. వివిధ శాఖల అధికారుల నుండి వివరాలను సేకరించి పలు సూచనలు చేశారు. ఇరుసుమండలో హెలిప్యాడ్ స్థలం,మాచవరం గ్రామపంచాయతీ పరిధిలోని పండువారిపేటలో రైతులకు పాసుపుస్తకాల పంపిణీ సభా స్థలం, అంబాజీపేట- గంటలకుర్రు రోడ్లో కార్యకర్తలతో సమావేశం సభా స్థలాలను పరిశీలించారు.వారితో పాటు వివిధ శాఖల జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో నియోజవర్గ టిడిపి కో-కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ, రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు బొంతు పెదబాబు,శిరిగినీడి వెంకటేశ్వరరావు,కూటమి నాయకులు గణపతి వీర రాఘవులు, పత్తి దత్తుడు,గూడాల ఫణి, దొమ్మేటి సాయికృష్ణ,కురసా అంజిబాబు,మైపాల తాతాజీ,రవణం రాము, నాగభూతులు వెంకట సుబ్బారావు,పబ్బినీడి రాంబాబు, పెదపూడి శ్రీనివాసరావు,గుంటూరి మురళి కృష్ణంరాజు,గుబ్బల వెంకటరమణ,నేదునూరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కన్నబాబు కుటుంబానికి నేతల పరామర్శ

తండ్రి కురసాల సత్యనారాయణ కు ఘన నివాళులు

కాకినాడ రూరల్, సెప్టెంబర్ 7 (ప్రభాతవార్త): మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర జిల్లా కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు తండ్రి సత్యనారాయణ ప్రథమ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులను పలువురు నేతలు పరామర్శించారు. దివంగత కురసాల సత్యనారాయణ సేవా దృక్పథం, క్రమశిక్షణ, నిబద్ధత ఆదర్శనీయమని పలువురు ప్రముఖులు కొనియాడారు. కురసాల కన్నబాబు తండ్రి సత్యనారాయణ ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం కాకినాడ రూరల్ వైద్యనగర్‌లో కుటుంబ సభ్యులు నిర్వహించారు. కార్యక్రమానికి బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు దాడిశెట్టి రాజా, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పినిపే విశ్వరూప్, గుడివాడ అమర్నాథ్, పిల్లి బోసు, మాజీ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మార్గాని భరత్, సోము వీర్రాజు, పొన్నాడ సతీష్, తలసాని రఘురాం, జక్కంపూడి రాజా, చింతా అనురాధ తదితరులు హాజరై సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. సత్యనారాయణ కుటుంబానికి మంచి విలువలు అందించడంతో పాటు సమాజ శ్రేయస్సు కోసం సేవలందించారని గుర్తుచేశారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని, జ్ఞాపకాలను స్మరించుకున్నారు. అనంతరం కన్నబాబు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సత్యనారాయణ ఆశయాలను కొనసాగిస్తున్న కన్నబాబు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాకినాడ రూరల్ నియోజకవర్గం నుండి అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రక్షణ చట్టం కోసం న్యాయవాదుల ర్యాలీ

రామచంద్రపురం,సెప్టెంబర్ 07 (ప్రభాత వార్త): ఆంధ్రప్రదేశ్‌లో న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తక్షణమే తీసుకురావాలని డిమాండ్ చేస్తూ రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు.బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటిపల్లి లోవరాజు,ప్రధాన కార్యదర్శి నీలం మధుసూదన్‌రావు నేతృత్వంలో నిరసన చేపట్టారు.బీహార్, రాజస్థాన్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఇప్పటికే న్యాయవాదుల రక్షణ చట్టాలు అమలులో ఉన్నాయని,ఆంధ్రప్రదేశ్‌లోనూ వెంటనే చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.అనంతరం కోర్టు ప్రాంగణం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించి,డివిజనల్ పరిపాలన అధికారి థూన్సీ సుగుణకుమారిని కలిసి వినతిపత్రం సమర్పించారు.కార్యక్రమంలో బి.తారకేశ్వరరావు, వి. నరేంద్రకుమార్‌రెడ్డి,సాదే నారాయణరావు, వాడ్రేవు సాయిప్రసాద్, దొమ్మాలపాటి సత్యనారాయణ, పోలిశెట్టి శ్రీనివాస్, పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, వాకలపూడి జయశంకర్, పలివెల సత్యనారాయణ, జి. మల్లేశ్వరరావు, నక్క దుర్గాదేవి, ఎస్.బి.ఎస్. కుమార్‌స్వామి, సూరంపూడి సత్యనారాయణ, శాఖ శ్రీనివాస్‌తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలి..

-జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్.మహేష్ కుమార్...

అంబాజీపేట, సెప్టెంబర్ 7, (ప్రభాతవార్త): అంబాజీపేట మండలంలో ఈ నెల 9న చేపట్టబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనను విజయవంతం చేసేందుకు ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.మండలంలోని కె.పెదపూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన ఏర్పాట్లు,భద్రతా చర్యలు, ప్రజల రాకపోకలు,పార్కింగ్,వైద్య, అగ్నిమాపక తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంను సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని ముందుగానే పరిశీలించి, శాఖల వారీగా అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అదేవిధంగా అగ్నిప్రమాదాల నివారణకు అగ్నిమాపక శాఖ తగినన్ని ఫైర్ ఇంజిన్లను సిద్ధంగా ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.భారీ వృక్షాలను తొలగించవద్దు: ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పేరుతో పర్యావరణానికి ఎలాంటి నష్టం కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భారీ వృక్షాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నరకరాదని, ఏర్పాట్లకు అవరోధంగా ఉన్న చిన్నపాటి పొదలను మాత్రమే అవసరమైన మేరకు తొలగించాలని సూచించారు.ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను శాఖల వారీగా సమన్వయం చేసుకుంటూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ రాహుల్ మీనా,కొత్తపేట ఆర్డిఓ జీవీవి సత్యనారాయణ, డీఎస్పీ సుంకర మురళీమోహన్రావు,అంబాజీపేట తాసిల్దార్ చిన్నబాబు,జిల్లా వైద్య శాఖ అధికారి ఎం.దుర్గారావుదొర,అగ్నిమాపక శాఖ అధికారి పార్థసారథి,రవాణా శాఖ అధికారి వెంకటేశ్వరరావు, ఏపీఎస్ఆర్టీసీ అధికారి సత్యనారాయణమూర్తి, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో టసర్ పట్టు సాగుపై

గిరిజన రైతులకు అవగాహన

చింతూరు సెప్టెంబర్ 7 ప్రభాత వార్త. వీఆర్.పురం మండలం దారపల్లి గ్రామంలో యం అర్ యం ఏ 2.0 (నా పట్టు--నా అభిమాన్ 2.0) కార్యక్రమంలో భాగంగా కొండరెడ్డి గిరిజన రైతులకు శాస్త్రీయ టసర్ పట్టు సాగుపై అవగాహన--సాంకేతిక ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర పట్టు మండలి--సీఎస్ఆర్‌టీఐ, మైసూరు శాస్త్రవేత్త-బి బి. శామ్యూల్ నాయక్, పట్టు పరిశ్రమ శాఖ సహాయ సంచాలకులు పాల్ రాజ్, సహాయ పట్టు అధికారి హరికృష్ణ తదితరుల సమన్వయంతో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మద్ది మొక్కల నిర్వహణ, పట్టుపురుగుల శాస్త్రీయ పెంపకం, పరిశుభ్రత, క్రిమిరహిత చర్యలు, వ్యాధులు--చీడపీడల నివారణ, పట్టు గూళ్ల సేకరణపై రైతులకు సూచనలు అందించారు. కొత్తగా టసర్ పట్టు సాగు చేపడుతున్న రైతులకు ప్లాస్టిక్ బొచ్చాలు, కత్తెరలు, పారలు, బ్లీచింగ్ పౌడర్, సున్నం తదితర సామగ్రిని పంపిణీ చేశారు..

ఢిల్లీలో లోతా రామారావుకు అరుదైన గౌరవం

రాజవొమ్మంగి, సెప్టెంబర్ 07, ప్రభాతవార్త రాజవొమ్మంగి మండలం లోదొడ్డి పంచాయతీ మాజీ సర్పంచ్, ఆదివాసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావుకు ఢిల్లీలో సోమవారం అరుదైన గౌరవం దక్కింది. సెప్టెంబర్ 6, 7 తేదీల్లో ఢిల్లీలోని మావలంకర్ హాల్‌లో ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు సెమినార్ నిర్వహించారు. ఈసెమినార్ కు 16 రాష్ట్రాల నుంచి ఆదివాసీ ప్రతినిధులు హాజరై గిరిజన విద్య, రిజర్వేషన్లు, ఆదివాసీ హక్కులు, చట్టాల అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. గిరిజన హక్కుల కోసం వివిధ ఉద్యమాల్లో పాల్గొని నిర్బంధాలు ఎదుర్కొన్న ఆదివాసీ నాయకులను ఈ సందర్భంగా ప్రత్యేకంగా సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి లోతా రామారావును ప్రత్యేకంగా ఎంపిక చేసి అరుదైన గౌరవాన్ని అందించారు. ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ చైర్మన్ జితేంద్ర చౌదరి చేతుల మీదుగా రామారావు సన్మానంను అందుకున్నారు. ఈ గౌరవం పట్ల ఆయనకు పలువురు ఆదివాసీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

వైసీపీ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు7, ప్రభాతవార్త. మాజీ మంత్రి, అమలాపురం పార్లమెంట్ ఇంచార్జ్, పి.ఏ.సి. సభ్యులు పినిపే విశ్వరూప్ అధ్యక్షతన, అమలాపురం అసెంబ్లీ ఇంచార్జ్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, కార్యాచరణ ప్రణాళిక, వార్డుల వారీగా ఎన్నికల సన్నాహకాలు, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలు తదితర అంశాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ రావు ,రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాసరావు,వంటెద్దు వెంకన్నాయుడు,పట్టణ అధ్యక్షులు సంసాని నాని ,మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనాగేంద్ర మణి, కుడిపూడి భరత్,మరియు సీనియర్ కౌన్సిలర్లు,ముఖ్య నాయకులు,ఆశావాహులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రముఖ రైతు కాపారపు

ఉమామహేశ్వరరావు మృతి

వి.ఆర్.పురం,సెప్టెంబర్7,ప్రభాతవార్త ప్రముఖ రైతు, వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాపారపు ఉమామహేశ్వరరావు (ఉమా) 60, గుండెపోటు తో హఠాన్మరణం చెందారు. సోమవారం మధ్యాహ్నం ఇంటివద్ద కళ్ళు తిరిగి పడిపోవటంతో కుటుంబ సభ్యులు బాధితుడిని హుటా హుటీన కోతులగుట్ట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స అవసరమని అక్కడి నుండి భద్రాచలం, ఖమ్మం నగరంలోని కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్తితి విషమించి బాధితుడు చికిత్స పొందుతు మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్యా, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడు ఉమామహేశ్వరరావు వి.ఆర్.పురం మండలంలో అత్యంత పెద్దరైతు. ఉమామహేశ్వరరావు రాజకీయంగా వైసిపి అయినప్పటికీ, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలతో స్నేహ సంబంధం కలిగి ఉండేవారు. ఉమామహేశ్వరరావు హఠాన్మరణం పట్ల పార్టీలకు అతీతంగా నాయకులు విచారం వ్యక్తం చేశారు. ఉమా అంత్యక్రియలు మంగళవారం ఆయన స్వగ్రామం సీతంపేట గ్రామంలో జరుగనున్నాయి.

ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయం...

ఇన్‌చార్జి పాలనలోనే...

వేళ పాల లేని మండల పరిషత్ అధికారులు...!

ఆత్రేయపురం, సెప్టెంబర్ 07,(ప్రభాత వార్త) ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయం ప్రస్తుతం పూర్తిస్థాయి నాయకత్వం లేక ఇన్‌చార్జి వ్యవస్థతోనే కొనసాగుతోంది. మండల అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర బిందువుగా ఉండాల్సిన ఈ కార్యాలయంలో అధికారులు ఉన్నప్పటికీ, పరిపాలనలో సమన్వయం లోపించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మూడు నెలల క్రితం ఎంపీడీవో పదోన్నతిపై బదిలీ కావడంతో ఆ స్థానంలో ఇప్పటి వరకు రెగ్యులర్ అధికారిని నియమించలేదు. దీంతో డిప్యూటీ ఎంపీడీవోకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినప్పటికీ, పూర్తిస్థాయి అధికారుల కొరత ప్రభావం కార్యాలయ పనితీరుపై పడుతున్నట్లు తెలుస్తోంది.కార్యాలయంలో ఎంపీడీవో, మండల పరిపాలన అధికారి, ఇద్దరు డిప్యూటీ ఎంపీడీవోలు ఉన్నప్పటికీ ప్రజలకు అవసరమైన సమయంలో అధికారులు అందుబాటులో ఉండడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఏ అధికారి ఎప్పుడు కార్యాలయానికి వస్తారు, ఎప్పుడు వెళ్తారనే విషయంపై స్పష్టత లేకపోవడంతో ప్రజలు తమ పనుల కోసం పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా వేదికలో ప్రజల సమస్యలు స్వీకరిస్తున్నప్పటికీ, వాటి పరిష్కారానికి అవసరమైన పరిపాలనా చొరవ కనిపించడం లేదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మండల పరిషత్ కార్యాలయానికి రెగ్యులర్ ఎంపీడీవోను నియమించి, అధికారుల పనితీరుపై పర్యవేక్షణ పెంచితేనే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల ప్రకటన మరియు మహజన సభ నోటీసు

ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల చట్టము మరియు నిబంధనావళి, 1964 ననుసరించి ప్రెసిడెంటు ది. కాకినాడ కో ఆపరేటివు బిల్డింగు సొసైటీ లిమిటెడ్ నెం.8979. ఉత్తర్వులు ఆర్సి నెం.1/2026 ప్రకారము ది. కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగు సొసైటీ లిమిటెడ్ నెం. 8979, డోరునెం. 13-4-13, రామయ్య వీధి, సూర్యారావుపేట, కాకినాడ యొక్క పాలకవర్గ సభ్యుల ఎన్నికలు ఈ క్రింది తెలిపిన వివరములు మరియు షెడ్యూలు ప్రకారము రహస్య బ్యాలెట్ పద్ధతిలో జరుపబడునని సంఘ ఓటర్లుకు తెలియపరచడమైనది.

1. ఎన్నికలు ద్వారా భర్తీచేయవలసిన మొత్తము స్థానములు 7 (ఏడు)
2. ఎన్నికలు షెడ్యూలు

అ. నామినేషన్ పత్రముల స్వీకరణ	ది.22-09-2026 (మంగళవారం) వ తేదీన ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 4.00గంటల వరకు సంఘ ప్రధాన కార్యాలయము నందు.
ఆ. నామినేషన్ పత్రముల పరిశీలన	ది.23-09-2026 (బుధవారం) 10.00 గంటల నుండి సంఘ ప్రధాన కార్యాలయము నందు.
ఇ. నామినేషన్ పత్రముల ఉపసంహరణ	ది.24-09-2026 (గురువారం) సాయంత్రం 5.00గంటల లోపు, సంఘ ప్రధాన కార్యాలయము నందు.
ఈ. పోలింగు (పోటి ఉన్న యెడల)	ది.02-10-2026 (శుక్రవారం) ఉదయం 7.00గంటల నుండి మధ్యహ్నం 3.00గంటల వరకు కాకినాడ మున్సిపల్ కార్పోరేషన్, సుపీరియర్ ఎంప్లాయిస్ ఆసోసియేషన్ భవనం, ఆనంద భారతి మైదానం, కాకినాడ.

ఉ. పోలింగు పూర్తయిన తర్వాత ఓట్ల లెక్కింపు చేసి ఫలితాలు ప్రకటించబడును. ఎన్నికలలో పాల్గొను ఓటర్లు మరియు పోటీచేయు అభ్యర్థులకు కొన్ని ముఖ్యమైన సూచనలు

(i) ఎన్నికలలో ఓటు వేయుటకు ఓటర్ల జాబితా నందు అర్హత కలిగిన సభ్యుడై ఉండాలి. ఓటు వేయుటకు వచ్చినపుడు సంఘమువారు జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డును లేదా ఆధార్ గుర్తింపు కార్డును పోలింగు ఆధికారికి చూపించవలయును. గుర్తింపు కార్డు లేని సభ్యులు సంఘ మేనేజరు వారికి సంప్రదించి ఫొటో గుర్తింపు కార్డును పొందవలయును.

(ii) సభ్యులు పరిశీలన నిమిత్

ధాన్యం డబ్బుల కోసం రైతు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు

పిఠాపురం, సెప్టెంబర్ 7 (ప్రభాతవార్త) ధాన్యం అమ్మి నెలలు గడుస్తున్నా డబ్బులు చెల్లించలేదని ఆరోపిస్తూ పిఠాపురం మండలంభో గాపురం గ్రామానికి చెందిన రైతు కరెడ్ల దుర్గారావు సోమవారం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ప్రతిపాడు గ్రామంలోని శివసాయి కృష్ణ రైస్ మిల్లుకు 62 బస్తాల సోనం రకం ధాన్యాన్ని విక్రయించినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. మొత్తం 4,240 కిలోల ధాన్యాన్ని బస్తా రూ.1700 చొప్పున మిల్లుకు ఇచ్చినట్లు తెలిపారు.మిల్లులోని కాటాపై ధాన్యాన్ని తూకం వేయించి, అనంతరం అన్‌లోడింగ్ కూడా చేసినట్లు రైతు పేర్కొన్నారు. ధాన్యం విక్రయించిన అనంతరం నగదు కోసం పలుమార్లు మిల్లు యజమానిని సంప్రదించినప్పటికీ, తనకు ధాన్యం రాలేదని చెబుతూ డబ్బులు చెల్లించడం లేదని ఆరోపించారు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, పంట కోసం చేసిన అప్పులు తీర్చలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తన ధాన్యానికి సంబంధించిన బకాయిలను ఇప్పించి న్యాయం చేయాలని పీజీఆర్ఎస్‌లో కోరారు.

యానాం రామన్నకోడులో పందిరి రాట ముహూర్తం

యానాం సెప్టెంబర్ 7:(ప్రభాతవార్త)వినాయక చవితిని పురస్కరించుకుని స్థానిక మెట్టకూరు రామన్నకోడు గ్రామంలో 22వ గణపతి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.ఇందులో భాగంగా శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద పందిరి రాట ముహూర్తాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు గణపతి నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కస్తూర్బా ఆశ్రమంలో ఉచిత వైద్య శిబిరం

సీతానగరం, సెప్టెంబర్ 7, (ప్రభాతవార్త) :సీతానగరంలోని కస్తూర్బా ఆశ్రమంలో సోమవారం రామకృష్ణ మిషన్, వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆసుపత్రిల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ సత్యం రమేష్ బాబు, సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందించారు. అదేవిధంగా, పరీక్షల అనంతరం 19 మందిని కాటరాక్ట్ ఆపరేషన్ నిమిత్తం వేమగిరి తరలించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, వై.వెంకటనారాయణ, కె.శ్రీనివాస్, ఎన్.చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి ఉపముఖ్యమంత్రి హామీ
-జనసేన గ్రామ ఇంచార్జ్ భాస్కర్

యు.కొత్తపల్లి, సెప్టెంబర్ 7 (ప్రభాతవార్త):మండలంలోని పాత ఇసుకపల్లిలో ఆదివారం పొలంలో పనిచేస్తుకుంటున్న రైతు పెంకే నూకరాజు పిడుగుపాటుకు గురై మృతి చెందిన ఘటనపై జనసేన పార్టీ అధినేత, పిఠాపురం ఎమ్మెల్యే, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేసి, మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చినట్లు జనసేన పార్టీ గ్రామ ఇంచార్జ్ కరణం వీర భాస్కర్ తెలిపారు. ఈ ఘటనలో నూకరాజు కుమారుడు మణికంఠ గాయపడగా, కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని చికిత్సకు సంబంధించిన ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని అధికారులు హామీ ఇచ్చినట్లు కూడా తెలిపారు.ఈ ఘటనపై జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రాము దృష్టికి, ఉపముఖ్యమంత్రి కార్యాలయానికి సమాచారం అందించడం జరిగిందని, సమాచారం అందిన వెంటనే స్పందించిన పార్టీ నాయకత్వం సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి, బాధిత కుటుంబానికి సహాయం అందించేలా చర్యలు చేపట్టిందన్నారు.సమాచారం అందిన క్షణాల్లోనే స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ కు వీరభాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే బండారు ఆర్థిక సహకారంతో ఉచ్చిలి పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ టీ-షర్టుల అందజేత...

ఆత్రేయపురం, సెప్టెంబర్ 07,(ప్రభాత వార్త) ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అందించిన ఆర్థిక సహకారంతో కొనుగోలు చేసిన స్పోర్ట్స్ టీ-షర్టులను మండలంలోని ఉచ్చిలి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం తెలుగు యువత అధ్యక్షులు వెచ్చా అనిల్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేశారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పాఠశాలలో క్రీడా పరికరాలు, విద్యార్థుల అవసరాల కోసం ఎమ్మెల్యే తన వంతు సహాయంగా నగదు అందజేశారు.ఎమ్మెల్యే అందించిన నిధులతో పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు అవసరమైన క్రీడా దుస్తులు, ఇతర క్రీడా సామగ్రిని కొనుగోలు చేసింది. ఇందులో భాగంగా విద్యార్థులకు స్పోర్ట్స్ టీ-షర్టులను అందజేసి క్రీడల పట్ల మరింత ఆసక్తి పెంపొందించేలా ప్రోత్సహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను అలవర్చుతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా ఉన్నత స్థాయిలో రాణించే అవకాశాలు ఉన్నాయని, అందుకు అవసరమైన ప్రోత్సాహం అందించేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు.ఎమ్మెల్యే సహకారంతో క్రీడా దుస్తులు అందుకోవడం పట్ల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేయగా, పాఠశాల ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం చేసిన తుమ్మలపల్లి రమేష్:

జగ్గంపేట సెప్టెంబర్ 7(ప్రభాతవార్త) ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ నిర్వహించిన అవార్డులలో జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ టీవీఎస్ రంగారావుకు ఉత్తమ ప్రధాన ఉపాధ్యాయుడు అవార్డు వచ్చిన సందర్భంగా జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జ్, తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మలపల్లి రమేష్ పాల్గొని ప్రధానోపాధ్యాయున్ని ఘనంగా సన్మానించినారు అనంతరం మాట్లాడుతూ జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా వచ్చినప్పటి నుండి స్కూలును ఎంతో అభివృద్ధి పథంలో నడిపించా రు డోనర్స్ ద్వారా స్కూలుకి సంబంధించిన పరికరాలన్నీ సమకూర్చి విద్యా బోధనలో క్రమశిక్షణలో స్కూలును ముందుకు నడిపించడంలో ఎనలేని కృషి చేస్తున్నారని వారి యొక్క సేవలను గుర్తించి జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయుల అవార్డు, హిందీ ఉపాధ్యాయులు పద్మావతికి ఉత్తమ ఉపాధ్యాయురాలు అందించినందుకు జగ్గంపేట నియోజకవర్గం లో గర్వకారణంగా ఉందని రమేష్ అన్నారు ఈ కార్యక్రమంలో ఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు పులి ప్రసాద్ కాయల మణికంఠ మాదారపు వీరబాబు కురుమల్ల నాగేశ్వరరావు అడబాల వీరబాబు ఆర్టియు మండల కన్వీనర్ సలాది ప్రభు కుమార్ ఉల్లం కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కు సన్మానం

ముమ్మిడివరం, సెప్టెంబర్ 7 ప్రభాత వార్త)మండల పరిధిలోని కొత్తలంక గ్రామంలో సచివాలయం వద్ద గల మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పనిచేయుచున్న మట్టపర్తి వెంకట రాంబాబు కు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు వచ్చిన సందర్భంగా సచివాలయ సిబ్బంది వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో వీఆర్వో రెడ్డి సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి డి ఈశ్వరరావు, వెల్ఫె రెసిడెంట్ పి రాజేష్, మహిళా పోలీస్ డి భాగ్యలక్ష్మి, అగ్రికల్చర్ అసిస్టెంట్ పెమ్మాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.కొత్తలంక పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులు అడబాల కాశీ విశ్వేశ్వర రావు,స్కూల్ చైర్మన్ జయను లక్ష్మణ కుమార్, కాశీ బాబాయి మెండి శ్రీనివాస్ మరియు ఎంపీపీ యూపీ స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులు రాంబాబు ను పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు ..

గోకవరం మండలంలో కొత్త ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ
ఈ నెల 16 వరకు దరఖాస్తుల స్వీకరణ

గోకవరం: ఆగష్టు 07 ప్రభాత బుుత్విక్కు

అర్హులైన పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితరులకు సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద నూతన పింఛన్ల మంజూరుకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. గోకవరం మండల పరిధిలోని 20 స్వర్ణ గ్రామ పంచాయతీల్లో అర్హులైన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి గోవింద్ కోరారు .సెప్టెంబరు 7 నుంచి 16 వరకు దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, ఈ-కేవైసీ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సెప్టెంబరు 17 నుంచి 21 వరకు సాధారణ అర్హత పరిశీలన, 22 నుంచి 24 వరకు క్షేత్రస్థాయిలో భౌతిక తనిఖీ, సిఫారసులు చేపడతారన్నారు. సెప్టెంబరు 25, 26 తేదీల్లో బడ్జెట్ ప్రతిపాదనలు, ప్రభుత్వ అనుమతి ప్రక్రియ నిర్వహించనున్నారన్నారు. అర్హులైన వారు తమ పరిధిలోని సంబంధిత గ్రామ కార్యాలయాల్లో ఉచితంగా దరఖాస్తు ఫారాలు పొందవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తును అవసరమైన ధ్రువపత్రాలతో పాటు గ్రామ కార్యాలయంలోని డిజిటల్ అసిస్టెంట్‌కు అందజేయాలన్నారు. వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అనంతరం సిస్టమ్ ద్వారా జారీ అయ్యే రసీదును తప్పనిసరిగా తీసుకోవాలని, దరఖాస్తు సమయంలోనే ఆధార్ ఆధారిత ఈ-కేవైసీ పూర్తి చేస్తారన్నారు. వృద్ధాప్య పింఛన్‌కు వయస్సు నిర్ధారణ కోసం ఆధార్ కార్డు, వితంతు పింఛన్‌కు భర్త మరణ ధ్రువీకరణ పత్రం, భర్త ఆధార్ నంబర్ సమర్పించాలన్నారు. ఒంటరి మహిళలు న్యాయస్థానం జారీ చేసిన విడాకుల పత్రం లేదా తహసీల్దార్ జారీ చేసిన అవివాహిత ధ్రువపత్రం అందజేయాలన్నారు. దివ్యాంగులు 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నట్లు తెలిపే సదరం సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. అలాగే చేనేత, మత్స్యకార, డప్పు కళాకారులు, చర్మకారులు, కల్లుగీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్లకు సంబంధిత ప్రభుత్వ శాఖలు లేదా జిల్లా మెడికల్ బోర్డు జారీ చేసిన అధికారిక ధ్రువపత్రాలు అవసరమని అధికారులు తెలిపారు. అన్ని కేటగిరీల వారు ఆధార్ కార్డు, రైస్ కార్డు లేదా ఆదాయ ధ్రువపత్రంతో పాటు సంబంధిత కేటగిరీ పత్రాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుల ప్రాథమిక పరిశీలన అనంతరం గ్రామ కార్యాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారుల నివాసాలకు వెళ్లి భౌతిక తనిఖీ నిర్వహిస్తారని, అనంతరం మండల స్థాయిలో అర్హతను పరిశీలించి ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తారన్నారు. తుది పింఛన్ మంజూరు రాష్ట్ర స్థాయిలో ూజుఱ్రా/ఱ+ూ ద్వారా జరుగుతుందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఆమోదం పొందిన అనంతరం పింఛన్ మంజూరైన నెల నుంచే చెల్లింపులు ప్రారంభమవుతాయని, గత నెలల బకాయిలు చెల్లించబడవని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఈ సమాచారాన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి అర్హులకు అవగాహన కల్పించాలని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి గోవింద్ కోరారు

అక్రమంగా బాణాసంచా తరలిస్తున్న ఇరువురిపై కేసు నమోదు..

అంబాజీపేట,సెప్టెంబర్ 7,(ప్రభాతవార్త): ఎటువంటి లైసెన్స్ లు, అనుమతులు,భద్రతా చర్యలు తీసుకోకుండా పేలుడు పదార్థాలు,బాణసంచాను అక్రమంగాతరలిస్తున్న ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ సుభాని తెలిపారు.ఇందుకు సంబంధించి ఎస్.ఐ కథనం ప్రకారం మండలం లోని గంగలకుర్రులో ఆదివారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా మాచవరంకు చెందిన కడలి వెంకట సూర్యనారాయణ, కుసుమే నాగేశ్వరరావులు అటోలో 1400 బాణాసంచా రాకెట్లను,తరలిస్తున్నారని వీటి విలువ రూ.19,600 ఉంటుందన్నారు. ఈ ఇరువురిని అదుపులోకి తీసుకొని బాణబాణాసంచా రాకెట్లను, వాటిని తరలిస్తున్న అటోను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఈ మేరకువారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ సుభానీ తెలిపారు.

నాగబాబు కి స్వాగతం పలికి సత్కరించిన తుమ్మలపల్లి రమేష్:



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 07 (ప్రభాతవార్త) ఏపీ గ్రీన్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా కాకినాడ పర్యటనకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు కొణిదల నాగబాబును కాకినాడ జి ఆర్ టి హోటల్ లో జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ప్రోగ్రామింగ్ కమిటీ కోఆర్డినేటర్ తుమ్మలపల్లి సాయి చందు, గరగా రామ్, గరగా లక్ష్మణ్, కాయల మణికంఠ, గుంటుక్కల పెద్ద తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట సచివాలయాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ దరఖాస్తుదారులకు ప్రత్యేక ఏర్పాట్లు:

జగ్గంపేట సెప్టెంబర్ 7 (ప్రభాతవార్త) రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఇవ్వనున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు సంబంధించి సెప్టెంబర్ 7 నుంచి 16 వరకు జగ్గంపేట మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో అప్లికేషన్లు స్వీకరిస్తున్న నేపథ్యంలో, దరఖాస్తుల కోసం వస్తున్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర కేటగిరీల లబ్ధిదారులకు సౌకర్యవంతంగా ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.జగ్గంపేట మండల తెలుగుదేశం పార్టీ జీను మణిబాబు ఆధ్వర్యంలో, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దేవరపల్లి మూర్తి, టౌన్ టీడీపీ అధ్యక్షుడు పాంట్రంగి రాంబాబు సమన్వయంతో ఈ ఏర్పాట్లు చేశారు.దరఖాస్తుదారుల కోసం తాగునీరు, ఎండ తగలకుండా చలవ కోసం టెంట్లు, కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు చేసి మానవతా దృక్పథాన్ని చాటారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ - ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందనడానికి ఇదే నిదర్శనమని అన్నారు.ప్రతి అర్హుడికి పెన్షన్ అందేలా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని, జగ్గంపేటలో ఒక్క అర్హుడు కూడా మిగిలిపోకుండా చూసే బాధ్యత తమదని స్పష్టం చేశారు.

సూర్యారావుపేట డంపింగ్ యార్డుకు రక్షణ గోడ
2027 జూన్ నాటికి తరలింపు: ఎమ్మెల్యే పంతం నానాజీ

కాకినాడ రూరల్, సెప్టెంబర్ 7 (ప్రభాతవార్త): కాకినాడ రూరల్ మండలం సూర్యరావుపేట లైట్‌హౌస్ వద్ద ఉన్న డంపింగ్ యార్డును సోమవారం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అధికారులతో కలిసి పరిశీలించారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలు, చెత్త నిర్వహణ తీరుపై అధికారులతో సమీక్షించారు. డంపింగ్ యార్డులోని వ్యర్థాలకు కొందరు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం వల్ల వాయు కాలుష్యం ఏర్పడి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. దీనిని అరికట్టేందుకు యార్డు చుట్టూ నూతన కాంపౌండ్ వాల్ నిర్మించడంతో పాటు నిరంతర పర్యవేక్షణకు వాచ్‌మెన్‌ను నియమించనున్నట్లు చెప్పారు. అనుమతి లేకుండా వ్యర్థాలను డంప్ చేస్తున్న వ్యక్తులు, సంస్థలపై ఇప్పటికే నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కాకినాడ--రాజమహేంద్రవరం మార్గంలో ఏర్పాటు చేయనున్న నూతన డంపింగ్ యార్డుకు 2027 జూన్ నాటికి లైట్‌హౌస్ డంపింగ్ యార్డును పూర్తిగా తరలిస్తామని నానాజీ స్పష్టం చేశారు. అప్పటివరకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సోదే ముసలయ్య, మల్లె భాస్కర్, పాలిక ఈశ్వర్, గేదెల చిన్నారావు, గంటా ప్రసాద్, సూరాడ శ్రీనివాస్, దూడ సింహాద్రి, కొనాడ శోభన్‌బాబు, డిప్యూటీ ఎండిఓ ఎం శ్రీరామ్, పంచాయతీ కార్యదర్శులు పిడుగు పాండురంగారావు, టీవివి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం

పిఠాపురం, సెప్టెంబర్ 7 (ప్రభాతవార్త) లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) పిఠాపురం శాఖ ఆధ్వర్యంలో పేమా వారోత్సవాల్లో భాగంగా సోమవారం వివిధ పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ రాజేష్ బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ రాజేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో చిత్రలేఖనం, వ్యాసరచనతో పాటు క్విజ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులలో విద్యతో పాటు క్రీడలు, సృజనాత్మక రంగాలపై ఆసక్తిని పెంపొందించడం ద్వారా వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి బహుమతులు ందించడం ద్వారా వారిలో మరింత ఉత్సాహాన్ని నింపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎల్ఐసీ అసిస్టెంట్ మేనేజర్ వీ. శ్రీనివాస్, స్టాఫ్ అసోసియేషన్ సభ్యులు చక్రవర్తి, ఆగేశ్వరరావు, ఆమరాజు, ఈవో శ్రీదేవి, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, ఎల్ఐసీ ఏజెంట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.6 కోట్లతో ఆత్రేయపురంలో ఆలయాల పునర్నిర్మాణానికి శంకుస్థాపన..

ఆత్రేయపురం, సెప్టెంబర్ 07,(ప్రభాత వార్త) దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో, గ్రామస్తులు, దాతల సహకారంతో సుమారు రూ.6 కోట్ల వ్యయంతో ఆత్రేయపురంలో వేంచేసియున్న శ్రీ బాల త్రిపురసుందరి సమేత రాజరాజేశ్వరి, శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వార్ల ఆలయాల పునర్నిర్మాణ పనులకు సోమవారం ఘనంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పుల్లేటికుర్తి నాగభూషణం, పుల్లేటికుర్తి భాస్కర్ శర్మ, వాడపల్లి జనార్దన ఆచార్యులు, వాడపల్లి అనంత్ కుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు-శ్రావణి దంపతులు, సొసైటీ అధ్యక్షులు ముదునూరి రామభద్రరాజు దంపతులు, రెండు ఆలయాల వేగేశ్న ప్రసాద్ రాజు, పులవర్తి కాశీ విశ్వనాథ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శంకుస్థాపన సందర్భంగా భక్తులు, గ్రామ పెద్దలు, దాతలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. పునర్నిర్మాణం అనంతరం ఈ ఆలయాలు మరింత వైభవంగా తీర్చిదిద్దబడటంతో పాటు ఆధ్యాత్మిక కేంద్రాలుగా అభివృద్ధి చెందనున్నాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

వాడపల్లి దేవస్థానం పార్కింగ్ ప్రాంగణంలో నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను చోరీ నిందితుడు అరెస్ట్
-11 మోటార్ సైకిళ్లు స్వాధీనం .... ఎస్ ఐ, ఎస్ రాము.

ఆత్రేయపురం, సెప్టెంబర్,07,(ప్రభాత వార్త) పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీల చేస్తుండగా ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 11 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఎస్సై ఎస్. రాముకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం ఉదయం లొల్ల కొత్త వంతెన వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా. రావులపాలెం వైపు నుంచి ఒక వ్యక్తి మోటార్ సైకిల్‌పై వేగంగా వస్తూ పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించాడు. వెంటనే అప్రమత్తమైన ఎస్సై రాము, సిబ్బంది అతడిని వెంబడించి పట్టుకున్నారు.విచారణలో అతను సఖినేటిపల్లి మండలం, సఖినేటిపల్లి లంక గ్రామానికి చెందిన అంబటి సత్యనారాయణ (49)గా గుర్తించారు. అతను కొంతకాలంగా కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం పార్కింగ్ ప్రాంగణంలో నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను చోరీ చేసి, వాటిని విక్రయిస్తున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. ముద్దాయిని అరెస్ట్ చేసి, చట్టపరమైన చర్యలు పూర్తి చేసిన అనంతరం కొత్తపేట న్యాయస్థానానికి తరలించినట్లు ఎస్సై, ఎస్. రాము తెలిపారు.

విద్యార్థులకు ఘన సన్మానం

యానాం, సెప్టెంబర్ 7:(ప్రభాతవార్త) స్థానిక కమలా నెహ్రూ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 2025--26 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను 1994--95 విద్యా సంవత్సరంలో అదే పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.పదో తరగతి పరీక్షల్లో చిక్కం నిఖి 600 మార్కులకు 495 మార్కులు, అనిశెట్టి ప్రజ్ఞ వినీత రెడ్డి 465 మార్కులు, చింతా చరణి 458 మార్కులు సాధించిన సందర్భంగా వారికి జ్ఞాపికలతో పాటు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థులను వారి తల్లిదండ్రులతో పాటు పూర్వ విద్యార్థులు అభినందించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా ఇతర విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రాజారామ్మోహన్ రావు, 1994--95 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు వి. మాధవి, కె.ఎస్.వి. లక్ష్మి, పుష్ప, విజయ, సూర్య ప్రభ, షహానా, మహేశ్వరి, సూర్యకళ, కె. కాంతమ్మతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు

నూతన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ...

సఖినేటిపల్లి సెప్టెంబర్ 7, ప్రభాత వార్త:అంబేడ్కర్ కోనసీమ జిల్లా, మలికిపురం మండలంలో రైతులకు నూతన పట్టాదారు పాసు పుస్తకాలను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అందజేశారు. లక్కవరం ఏం జి గార్డెన్స్‌లో లక్కవరం, బట్టేలంక, ఇరుసుమండ గ్రామాలకు చెందిన రైతులకు రీ-సర్వేలో రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన ర

ఎన్టీఆర్ భరోసా నూతన పింఛన్లకు దరఖాస్తుల ఆహ్వానం.

చింతూరు సెప్టెంబర్ 7 ప్రభాత వార్త.ఎన్టీఆర్ భరోసా పథకం కింద నూతన పింఛన్ల కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చింతూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సుందం శ్రీనివాసు దొర తెలిపారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల, ఒంటరి మహిళలతో పాటు కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, డప్పు కళాకారులు, చర్మకారులు తదితర వర్గాలకు సంబంధించిన పింఛన్ల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.దరఖాస్తులను గ్రామ, వార్డు సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్ లేదా పంచాయతీ కార్యదర్శికి సమర్పించాలి. దరఖాస్తుతో పాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, భర్త మరణించినట్లయితే మరణ ధ్రువీకరణ పత్రం, సదరం ధ్రువీకరణ పత్రం, సంబంధిత వృత్తి ధ్రువీకరణ పత్రాలు, భార్యాభర్తల ఆధార్ కార్డులు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, మొబైల్ నంబర్ తదితర వివరాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సెప్టెంబర్ 16వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని ఎంపీడీఓ కోరారు.

ప్రజల సహకారంతోనే స్వచ్ఛ్ ఆంధ్ర సాధ్యం.

-స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ కుమార్ రెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబర్ 7(ప్రభాతవార్త)పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకర వాతావరణ నిర్మాణం కోసం ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజల సహకారం మద్దతు ఎంతో అవసరమని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ బి సునీల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా తో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. 17వ వార్డు ఐఓసి వద్దనున్న జి టి ఎస్ ను పరిశీలించారు. నగరంలో గార్బేజ్ వలన రెబల్ పాయింట్లు ను ఆర్ ఆర్ ఆర్ సెంటర్ సాయంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే ప్రయత్నాన్ని అభినందించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ 2026 గైడ్ లైన్స్ ను తప్పక పాటించాలని ఘన వ్యర్థాల నిర్వహణను పక్కాగా నిర్వహించాలని లెగిసి వ్యర్థాలను పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పేపర్ మిల్లు వద్ద ఉన్న డంపింగ్ యార్డ్ ను పరిశీలించారు. 11వ వార్డు వి ఎల్ పురం లో డోర్ టు డోర్ చెత్త సేకరణను పరిశీలించి వెహికల్ మూమెంట్స్ యాక్షన్ ప్లాన్ అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఎంహెచ్ఓ వినూత్న శానిటరీ సూపర్వైజర్ శ్రీనివాస్ పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వాసవీ క్లబ్ వారోత్సవాలు.

తాళ్లరేవు సెప్టెంబరు 7 ప్రభాతవార్త: తాళ్లరేవులో వాసవీ క్లబ్ వారోత్సవాలు ఘనంగా ముగిసాయి. కే. సి. గుప్తా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, వారం రోజులపాటు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెగా వైద్య శిబిరం, బాలికల సాధికారత కోసం శిక్షణ, ఉపాధ్యాయ దినోత్సవం, జర్నలిస్టుల డే వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి కపుల్స్ కు పలు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

చిన్నారులను భయపెడుతున్న వీధి కుక్కల గుంపులు

-యానాంలో బీచ్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై పదుల సంఖ్యలో సంచారం - పర్యాటకులు, స్థానికుల్లో ఆందోళన



యానాం, సెప్టెంబర్ 7: (ప్రభాతవార్త) యానాంలో బీచ్‌ను సందర్శించేందుకు వెళ్లే ప్రధాన రహదారిపై వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తుండటంతో స్థానికులు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకేసారి పదుల సంఖ్యలో కుక్కలు రహదారిపై తిరుగుతుండటంతో ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారు.బీచ్‌ను వీక్షించేందుకు ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో పర్యాటకులు, కుటుంబాలు ఈ మార్గాన్ని వినియోగిస్తుంటారు. అయితే రహదారిపై గుంపులుగా కుక్కలు సంచరిస్తుండటంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు అప్రమత్తంగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. చిన్నారులతో కలిసి బీచ్‌కు వచ్చే కుటుంబాలు కుక్కల గుంపులను చూసి ఆందోళన చెందుతున్నారని స్థానికులు చెబుతున్నారు.కుక్కలు గుంపులుగా తిరుగుతున్న నేపథ్యంలో ఎప్పుడైనా చిన్నారులు లేదా పాదచారులపై దాడి జరిగే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.యానాం ఒక ప్రముఖ పర్యాటక ప్రాంతం కావడంతో బీచ్‌కు వచ్చే సందర్శకులకు సురక్షిత వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. వీధి కుక్కల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టి, పర్యాటకులు, చిన్నారులు, వృద్ధులు భయంలేకుండా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నారు.“బీచ్‌కు వచ్చి ప్రశాంతంగా గడపాల్సిన పర్యాటకులు కుక్కల గుంపులను చూసి భయపడాల్సిన పరిస్థితి ఉండకూడదు. అధికారులు వెంటనే స్పందించాలి” అని స్థానికులు కోరుతున్నారు.

టీడీపీ గ్రామ అధ్యక్షురాలు సాయి పాడె మోసిన వాసంశెట్టి సత్యం

కె. గంగవరం, సెప్టెంబర్ 7 (ప్రభాతవార్త): కె.గంగవరం మండలం సుందరపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షురాలు శీరెడ్డి సాయి రామలక్ష్మి ఆకస్మిక మృతి చెందారు.మంత్రి వాసంశెట్టి సుభాష్,వాసంశెట్టి సత్యం తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్యమైన సమావేశాల్లో అమరావతిలో ఉన్నందున, ఆయన ఆదేశాల మేరకు వాసంశెట్టి సత్యం సుందరపల్లికి వెళ్లి సాయి రామలక్ష్మి భర్త, సీనియర్ టీడీపీ కార్యకర్త శీరెడ్డి సత్తిబాబు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం సాయి రామలక్ష్మి భౌతికకాయంపై తెలుగుదేశం పార్టీ జెండాను కప్పి, పాడె మోసి పార్టీ తరఫున గౌరవప్రదమైన అంతిమ వీడ్కోలు పలికారు. కార్యకర్తల కుటుంబాలకు ఏ ఆపద వచ్చినా వారికి అండగా నిలుస్తాం అని వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు.సాయి రామలక్ష్మి మృతి పార్టీకి తీరని లోటని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, ఎంపీటీసీ తాడాల జానకిరామ్, సలాది శ్రీను, సత్తిబాబు బుజ్జిలు, అధిక సంఖ్యలో సుందరపల్లి గ్రామ ప్రజలు కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, అభిమానులు పాల్గొని సాయి రామలక్ష్మికి ఘన నివాళులర్పించారు.

పాపారావు కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

శంఖవరం, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గాబు లక్ష్మి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు శంఖవరం మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు గాబు కృష్ణ సోదరుడు పాపారావు భార్య లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ సోమవారం కత్తిపూడి లో గాబు పాపారావు ఇంటికి వెళ్లి పరామర్శించారు. లక్ష్మి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. గాబు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. లక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాబు గంగాధర్ గౌతునాగు రాయి పెద్దకాపు గాబు కృష్ణ తదితరులు ఉన్నారు

కలియుగ ప్రత్యక్ష దైవం... వెంకన్నకు అష్టోత్తర పూజ నిత్యకళ్యాణం... పాల్గొన్న అశేష భక్త జనం..



అత్రేయపురం, సెప్టెంబర్, 07.(ప్రభాత వార్త)ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి సోమవారం భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.ఉదయం స్వామివారికి మేలుకొలుపు శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శతనామావళి, కల్యాణం, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఏడువారాల నోము పూర్తి అయిన భక్తులు అష్టోత్తర పూజ నిత్యకళ్యాణం లలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని వకుళ మాత అన్నదాన భవనంలో అన్న ప్రసాదాలను స్వీకరించారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు తగు ఏర్పాట్లు చేశారు.

ఎల్ ని నో ప్రభావం కారణంగా.. కూనవరం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

- పదవీకాలం ముగియనున్న సందర్భంగా ప్రజా ప్రతినిధులకు అధికారుల ఘన సన్మానం

కూనవరం, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త : కూనవరం మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించాలని స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యులందరూ ముక్తకంఠంతో కోరారు. సోమవారం స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షురాలు పాయం రంగమ్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈనెల 23వ తేదీతో ప్రజా ప్రతినిధుల పదవీకాలం ముగియనున్న సందర్భంగా ఆఖరి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీపీ, జడ్పిటిసి, ఎంపీటీసీ, కో ఆప్షన్ మెంబర్లను అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో ఎంపీపీ పాయం రంగమ్మ మాట్లాడారు.ఎల్ ని నో ప్రభావంతో మండలంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, రైతులకు వర్షాలు లేక పంటలు వేయలేని స్థితిలో ఉన్నారన్నారు. అయితే మండలాన్ని కరువు మండలంగా ప్రకటించే విధంగా తీర్మానం చేయాలని కోరడంతో ఎంపిడిఓ ఆశీర్వాదం తీర్మానం చేస్తున్నట్లు ప్రకటించారు. తర్వాత ఎంపీటీసీ సభ్యుడు బండారు సాంబశివరావు పోలవరం నిర్వాసితులకు ఇంకా కొందరికి ఇంటికి సంబంధించిన స్ట్రక్చర్ వేల్యూ రాలేదని, అలాగే కొందరి అర్హుల పేర్లు నిర్వాసితుల జాబితాలో లేవని అన్నారు. ఇందుకు స్థానిక తహసిల్దార్ ధర్మేంద్ర సమాధానమిస్తూ పోలవరం ఏ ఒక్క నిర్వాసితుడికి అన్యాయం జరగదని, ఇందుకు సంబంధించిన లిస్టు పరిశీలన జరుగుతుందని అన్నారు. త్వరలోనే నిర్వాసితులకు పరిహారం జమ చేయడం, మొదలు పెట్టడం జరుగుతుందని అన్నారు. అలాగే ఎంపిడిఓ ఆశీర్వాదం మాట్లాడారు. మండలంలోని అర్హులైన వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. జిల్లా కేంద్రానికి సరిపడ ఆర్టీసీ బస్సులు లేవని, అదనంగా రెండు సర్వీసులు ఏర్పాటు చేయాలని జడ్పిటిసి సభ్యురాలు గుజ్జా విజయ కోరడంతో తీర్మానం చేయడం జరిగింది. ఈ సర్వసభ్య సమావేశంలో డిప్యూటీ ఎంపీడీఓ జగన్నాధరావు, మండల అధికారులు వ్యవసాయాధికారిణి దేవి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి మల్లిక, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ భాను ప్రకాష్, ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ ఏ ఈ ప్రవీణ్, వెలుగు సి సి లు సుధాకర్, సచివాలయం సిబ్బంది మరియు ఎంపీటీసీలు, కో ఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

పి జి ఆర్ ఎస్ లో 171 అర్జీలు

-అర్జీలు నిర్ణిత సమయంలో పరిష్కరించాలి-కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబర్ 7(ప్రభాతవార్త)ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించడంతోపాటు ఫిర్యాదుదారులకు సంతృప్తికరమైన పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ఇప్పటివరకు స్వీకరించిన అర్జీల పరిష్కార పురోగతి పెండింగ్ అర్జీలు అసంతృప్తి ఫిర్యాదులు తదితర అంశాలను సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ ఎస్ లో మొత్తం 171 అర్జీలు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. శాఖల వారీగా పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖకు 36 హోం శాఖకు 22 వ్యవసాయ సహకార శాఖలకు 5 పురపాలక పరిపాలన పట్టణాభివృద్ధి శాఖకు 4 వైద్య ఆరోగ్య శాఖ మూడు ఇంధన శాఖకు మూడు మైనారిటీ వెల్ఫేర్ రెండు ఉన్నత విద్యకు రెండు పరిశ్రమల వాణిజ్య శాఖకు రెండు అర్జీలు అందాయని పేర్కొన్నారు. రెవిన్యూ క్లినిక్ కి సంబంధించి 83 స్వీకరించగా వీటిలో రికార్డ్స్ ఆఫ్ రైట్స్ సంబంధించి 23 రి సర్వే సమస్యలపై 13 వివిధ అంశాలపై 8 భూ ఆక్రమణలపై 8 ఎఫ్ లైన్ పిటిషన్ 8 22 ఏ నుంచి తొలగించాలంటే నాలుగు ఆక్రమణలపై 3 రిజిస్ట్రేషన్ సేవలపై రెండు కుల దృవీకరణ పై రెండు సేకరణ సమస్యలపై రెండు అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై మేఘస్వరూ సహాయ కలెక్టర్ కె ఆదిత్య శర్మ డిఆర్ఓ ఎస్ భాస్కర్ రెడ్డి ఆర్డీవోలు ఎస్ శివ రాముడు కే ఆనందరావు పి భాగ్యలక్ష్మి డి ఎల్ డి ఓ పి వీణా దేవి డిఎస్పి ఏ శివప్రియ తదితరులు పాల్గొన్నారు.

వెంచర్ బూటకం.. రూ.7 కోట్ల దగా!

-36 మంది బాధితులకు రియల్ ఎస్టేట్ ఓనర్ వేణు రామయ్య షాక్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త,

రాళి ఎవెన్యూస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలోని చంద్రిక అవంతిక ఫేజ్--2 వెంచర్‌లో 36 మంది నుంచి సుమారు రూ.7 కోట్లు వసూలు చేసి, ఇళ్లు, ప్లాట్లు అప్పగించలేదని నిర్వాహకుడు వేణు రామయ్యపై బాధితులు ఆరోపిస్తున్నారు. ఒక్కొక్కరి వద్ద సుమారు రూ.26 లక్షలు తీసుకున్నారని తెలిపారు. నాలుగు ఇళ్లకు పునాదులు వేసిన అనంతరం నిర్మాణ పనులు నిలిచిపోయాయని, 2018 నుంచి తమ సొమ్ము కోసం తిరుగుతున్నామని వాపోయారు. మృత్యుంజయుడు, జగదీష్‌తో పాటు పలువురు బాధితులు కోర్టును ఆశ్రయించారు. కేసు విచారణలో ఉన్నప్పటికీ వాయిదాలకు హాజరుకాకుండా కాలయాపన చేస్తున్నారని వారు ఆరోపించారు. ఈ నేపథ్యంలో సోమవారం రాజమహేంద్రవరం కన్స్యూమర్ కోర్టులో కోర్టు ధిక్కరణకు సంబంధించిన నాన్ బెయిలబుల్ చర్యల నేపథ్యంలో వేణు రామయ్యను హాజరుపరిచినట్లు బాధితులు తెలిపారు. మరోవైపు విజయవాడ--గన్నవరం రాయ్‌నగర్‌లోని మరో ప్రాజెక్టుపైనా ఇలాంటి ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. తమ డబ్బు తిరిగి ఇప్పించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పిజిఆర్ఎస్ లో అధికారులు ఎక్కడ ?

కాట్రేనికోన సెప్టెంబర్ 07 (ప్రభాతవార్త)గ్రామాలలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కాట్రేనికోనలో సక్రమంగా సాగడం లేదని పలువురు ప్రజలు అంటున్నారు. కచ్చితంగా పాల్గొనాల్సిన మండల స్థాయి అధికారులు ఒకరిద్దరు మినహా మిగిలిన వారు పాల్గొనని పరిస్థితి ప్రతివారం పరిపాటిగా జరుగుతుందని ప్రజల ఆవేద వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సోమవారం కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మండల స్థాయి అధికారులు అంతా ఇక్కడ విధిగా పాల్గొనాలి. కానీ కొందరు అధికారులు పిజిఆర్ఎస్ లో పాల్గొనకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది సమావేశానికి హడావిడిగా వచ్చి కొంతసేపు ఉండి వెళ్ళిపోతున్నారు. మరి కొంతమంది తమకు నచ్చిన సమయంలో వస్తున్నారు కొందరైతే తాము పాల్గొనకుండా కిందిస్థాయి సిబ్బందిని పంపిస్తున్నారు. దాంతో అర్జీలు అందించేందుకు వచ్చిన ప్రజల సమస్యలు ఇంకెప్పుడు పరిష్కారం అవుతాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి ప్రతి సోమవారం గ్రీవెన్స్ లో మండల స్థాయి అధికారులంత పాల్గొనేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజల కోరుతున్నారు .దీనిపై ఎంపీడీవో రాజేశ్వరరావు వివరణ కోరగా సమావేశానికి హాజరు కాని వారి వివరాలు కలెక్టరు కు పంపిస్తానని ఆయన తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటమన్నారు.

మహిళా చట్టాలు, గంజాయిపై అవగాహన ర్యాలీ

రాజవొమ్మంగి, సెప్టెంబరు 7, ప్రభాతవార్త మహిళా చట్టాలు, గంజాయి దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రాజవొమ్మంగి సి. ఐ. సన్యాసినాయుడు, ఎస్. ఐ. వెంకట్రావు ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులతో అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. రాజవొమ్మంగి హైస్కూల్ నుంచి అల్లూరి సీతారామరాజు సెంటర్ వరకూ ర్యాలీ సాగింది.అల్లూరి సీతారామరాజు సెంటర్‌లో విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి మహిళా చట్టాలు, గంజాయికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో సి. ఐ. సన్యాసినాయుడు మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలు, శక్తి యాప్ వినియోగం గురించి వివరించారు. గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలు, యువతపై దాని ప్రభావం గురించి పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఎస్. ఐ. వెంకట్రావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మహిళల భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సి. ఐ. సన్యాసినాయుడు, ఎస్. ఐ. వెంకట్రావు, హెచ్. ఎం. ఆదిలక్ష్మి, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్.ఎం.ఎం.ఎస్ విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ

కె గంగవరం, సెప్టెంబర్ 7, (ప్రభాతవార్త): కె గంగవరం మండలం కుందూరు గ్రామ పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు దాతలు సమకూర్చిన పుస్తకాలు, విద్యాసామగ్రిని సోమవారం కుందూరు పాఠశాలలో పంపిణీ చేశారు. విద్యా కమిటీ ప్రెసిడెంట్ పీవీవీ సత్యనారాయణ విద్యార్థులకు పుస్తకాలు, విద్యాసామగ్రిని అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థుల చదువుకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసు, ఉపాధ్యాయులు ఎస్. పాపాయి, ఇంద్రకంటి భానుకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా జీతాల్లేవు

-డీసీసీబీ ద్వారా వెంటనే వేతనాలు చెల్లించాలిడిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఉద్యోగుల వినతి

పిఠాపురం, సెప్టెంబర్ 7 (ప్రభాతవార్త) పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) శాఖలు, పిఠాపురం,యు.కొత్తపల్లి పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు నాలుగు నెలలుగా జీతాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మే నుంచి ఆగస్టు వరకు వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్యను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఏపీ స్టేట్ అగ్రికల్చర్ అండ్ కోఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు సోమవారం పిఠాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలో పీఐఆర్ఎస్ సందర్భంగా పాడా పీడీ ఎన్.వి. శివరామ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.ప్రభుత్వం గతంలో జారీ చేసిన జీవో నంబర్ 322 లోని నిబంధనల ప్రకారం 'కెపాసిటీ టు పే' లేని సంఘాల ఉద్యోగులకు సంబంధిత డీసీసీబీ ద్వారా వేతనాలు చెల్లించాల్సి ఉందని వారు పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన పత్రాలను బ్యాంకుకు ఇప్పటికే సమర్పించినప్పటికీ, మరికొంత కాలం వేచి చూడాలని డీసీసీబీ అధికారులు చెబుతున్నారని తెలిపారు.జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో పాలకవర్గాల ఆధ్వర్యంలో సంఘాల నుంచే ఉద్యోగులకు వేతనాలు అందుతున్నాయని, తమ నియోజకవర్గంలో మాత్రం ప్రత్యేక పరిస్థితుల కారణంగా సమస్య తలెత్తిందని వివరించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు దెబ్బతిన్న నేపథ్యంలో వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వారు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కోరారు.వినతి పత్రం అందించిన వారిలో యూనియన్ జనరల్ సెక్రెటరీ నరసరాజు, ఉపాధ్యక్షుడు ఎ.సూర్యనారాయణ రెడ్డి, సీఈవోలు, కె.వి రాఘవ, వి.కామేశ్వరరావు, ఎ.సత్యనారాయణ, ఎం.వీరభద్రరావు,సిహెచ్. ఈశ్వరుడు, ఎ.గోవిందరాయుడు, జి.కామేశ్వరరావు, వై వి ఎస్ ఎన్ మూర్తి, ఎ.రామ మోహన్ రావు, ఎ.శ్రీను, సిబ్బంది ఉన్నారు

మార్మోగిన విఘ్నేశ్వర నామస్మరణ..

-వైభవంగా విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం

గోపాలపురం, సెప్టెంబరు 7 (ప్రభాతవార్త): గోపాలపురం గ్రామంలో భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. శ్రీ వరసిద్ధి విఘ్నేశ్వర స్వామివారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన, మహాకుంభాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన ఆలయాన్ని తొలగించి, అదే ప్రాంతంలో నూతన ఆలయాన్ని నిర్మించారు. నూతన ఆలయంలో స్వామివారి విగ్రహాన్ని శాస్త్రోక్తంగా పునఃప్రతిష్ఠించారు.వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ సాగిన పూజా కార్యక్రమాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజులుగా గ్రామంలో భక్తి సందడి నెలకొంది. ఆలయ పరిసరాలు, ప్రధాన కూడలిని విద్యుత్ దీపాలతో అలంకరించగా, భక్తిగీతాలతో పండుగ వాతావరణం నెలకొంది.శాస్త్రోక్త విధానంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాది క్రతువులు నిర్వహించారు. పవిత్ర జలాలతో మహాకుంభాభిషేకం నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాల నడుమ స్వామివారి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. ఆ పవిత్ర ఘట్టాన్ని తిలకించిన భక్తులు 'వినాయకా... విఘ్నేశ్వరా...' అంటూ నామస్మరణ చేస్తూ పరవశించారు.ఈ మహోత్సవంలో భాగంగా శ్రీ సిద్ధి బుద్ధి సమేత విఘ్నేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు.కల్యాణ ఘట్టం సందర్భంగా ఆలయ ప్రాంగణం మంగళాక్షతలు, పుష్పాలతో శోభాయమానంగా మారింది. అనంతరంసోమవారం నిర్వహించిన భారీ అన్న సమారాధనలో గ్రామస్థులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుని కృప తమ గ్రామంపై ఎల్లప్పుడూ ఉండాలని భక్తులు ప్రార్థించారు. గ్రామ ప్రజలకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సర్వమంగళాలు కలగాలని స్వామివారిని వేడుకున్నారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా?

- కరిచర్లగూడెం మంచినీటి ట్యాంక్‌లో కీటకాలు



**గోపాలపురం, సెప్టెంబరు 7 (ప్రభాతవ